నిర్మల.

ఆ రోజు రాత్రి స్వీట్ పేకెట్‌తో యింటికి వచ్చిన బాలాజీ, శివాజీలను చూసి విషయం అర్థమైంది నిర్మలకు. తనకు ఉద్యోగం దొరికిందని, మంచి జీతం అఫర్ చేశారని, వారం రోజుల్లో డ్యూటీలో చేరాలని, అంబిక పేరు చెప్పగానే శ్రీపాదమూర్తి ఉద్యోగం యిచ్చారని ఆనందంగా చెప్పాడు శివాజీ.

"రేపు ఉదయాన్నే అంబిక యింటికి వెళ్ళి ఆమెకు థాంక్స్ చెప్పి వస్తాను" అంది నిర్మల.

"అలాగే. చూశావా. ఆ రోజు నేను కోపంతో ఆమెను ఓ మాట అనబోయి మానుకొన్నాను. ఆ మాట అననందువల్ల ఆమె ఈరోజు మనకు ఎంతో గొప్ప సహాయం చేశారు. అందుకే అనవసరంగా మాట జారవద్దని మన పెద్దలన్నారు" అన్నాడు బాలాజీ.

"ఈ మాట మాత్రం ముమ్మాటికీ నిజం" అంది నిర్మల.

**-సి.ఎన్.చంద్రశేఖర్ (చిత్తూరు)**

# మూర్ఖత్వం

అకౌంటెంట్ శ్రీధర్ భయం భయంగా ఆఫీసుగదిలో అడుగుపెట్టేడు. ఆఫీసర్ రంగనాథం సీరియస్‌గా ఏదో ఫైలు చూస్తున్నాడు. తన ఉనికిని తెలియజేయడానికి శ్రీధర్ చిన్నగా దగ్గేడు. "సార్!" నసిగేడు శ్రీధర్.

లీవు కావలసి వచ్చినప్పుడే ఇలా నసుగుతారని రంగనాథానికి బాగా తెలుసు. మాట్లాడితే చాలు లీవు. ఏదో చప్పు కారణం చెబుతారు. లీవుల దగ్గర రంగనాథం చాలా స్ట్రిక్ట్‌గా వుంటాడు. ఒక పట్టాన ఎవరికీ లీవు శాంక్షను చెయ్యడు. ఆయన లీవు శాంక్షను చేసేడంటే ప్రమోషన్ వచ్చినంత సంబరపడిపోతారు క్రింది ఉద్యోగులు.

"ఎస్!" అన్నాడు సీరియస్‌గా రంగనాథం.

"సార్! మా అమ్మగారికి సీరియస్‌గా వుందట. ఫోను వచ్చింది. నాలుగు రోజులు లీవుకావాలి సార్! నేను అర్జంటుగా వెళ్ళాలి సార్! మా అమ్మని హాస్పిటల్‌లో చేర్చాలి. మా ఫాదర్ చాలా కంగారుపడుతూ ఫోన్ చేసేరు సార్!" తన గోడును వెళ్ళబుచ్చుకున్నాడు శ్రీధర్ అతి వినయంగా.

"ఆ పనేదో మీ ఫాదరే చెయ్యొచ్చు కదా! రేపు మన కమీషనరుగారు వస్తున్నారు. నీకు తెలుసుకదా! ఆయన సంగతి తెలిసి, లీవు పెడతానంటావేమిటి? ముసలాళ్ళంతేలే అలా సీరియస్‌గా వుందని చెప్తే కానీ రారని అలా చెబుతూంటారు. కమీషనర్ విజిట్ అయిపోగానే వెడుదువుగాని!" రంగనాథం ఆ విషయాన్ని క్యాజువల్‌గా తీసిపారేసి మళ్ళీ ఫైలులో తల దూర్చేడు.

"అది కాదు సార్! మా నాన్నగారెప్పుడూ అబద్ధమాడరు సార్! మా అమ్మగారికీమధ్య ఒంట్లో బాగుండటం లేదు. నేను లేకపోతే వాళ్ళకి డాక్టరుకి చూపించే దిక్కు లేదు సార్!"

"దొరికేడయ్యా సత్యహరిశ్చంద్రుడు అబద్ధాలాడరుట! అసలే మనకి సెలవులెక్కువైపోయేయని ప్రజలు మనమీదపడి తెగ ఏడుస్తున్నారు. రోజా పేపర్లో చదవడం లేదా?" కసురుతూ మాట్లాడేడు రంగనాథం.

"సార్! వాళ్ళకి సెలవుల గురించే తెలుసుగాని మనం రోజూ పది, పదకొండు గంటలవరకు చేసే గొడ్డు చాకిరీ తెలియదు సార్! మనల్ని పెంచి పెద్దచేసి, ఇంతటి వాళ్ళని చేసిన తల్లిదండ్రుల్ని చివరి జీవితంలో మనం చూడకపోతే ఎవరు చూస్తారు సార్?" కొంచెం నిష్ఠూరంగానే మాట్లాడేడు శ్రీధర్.

"చూడు, మిస్టర్ శ్రీధర్! నువ్వు నాకు పాఠాలు నేర్పక్కర్లేదు. రేపు కమీషనర్ వస్తున్నప్పుడు, నీకు నేను లీవు ఇవ్వలేను, ఇవ్వను. అయామ్ వెరీ సారీ! యు కెన్ గో!" ఒక్కసారి సీరియస్ అయ్యేడు రంగనాథం. బిక్క మొహం వేసుకుని వెనక్కి తిరిగి ఉసూరుమంటూ కుర్చీలో కూలబడ్డాడు శ్రీధర్.

"ఏం శ్రీధర్ సెలవివ్వలేదా?" అడిగేడు కొలీగ్ రాజు.

"లేదు రాజూ! వీడి సంగతి మనకు తెలుసుకదా!"



"అందుకే నేను చెప్పేను! ఇలాంటి వాళ్ళకి న్యాయంగానూ, నిజం చెప్పి లీవడిగితే ఇవ్వరు. వెళ్ళిపోయి, మర్నాడు నాలాంటి వాళ్ళచేత ఎవరో దగ్గర బంధువు పోయేరని లీవులెటరు మొహాన కొట్టడమే!" సలహా ఇచ్చేడు రాజు.

"నేనలా అబద్ధమాడలేను రాజూ!"

"ఆడలేవు! ఇప్పుడేమయింది? అలా సత్యహరిశ్చంద్రుడిలా కాళ్ళు ముడుచుకు కూర్చుంటే నువ్వీ జన్మలో మీ అమ్మగారిని డాక్టరుకి చూపించలేవు!"

"సరే! ఈసారి నీ సలహా పాటిస్తానులే!" తన పనిలో నిమగ్నమయ్యేడు శ్రీధర్.

మరుసటిరోజు కమీషనర్ వచ్చేరు. రెండు రోజులు ఆఫీసంతా హడావిడి. మూడవరోజు కమీషనర్ వెళ్ళిపోయారు. ఇప్పుడైనా లీవు ఇస్తాడో ఇవ్వడో అనుకుంటూ నెమ్మదిగా బాస్‌రూంలోకి వెళ్ళేడు శ్రీధర్. కానీ రంగనాథం, హడావిడిగా టేబులు సర్దుకుంటున్నాడు. "రా శ్రీధర్! నేను అర్జంటుగా హైదరాబాదు వెళుతున్నాను. రెండు రోజుల్లో వచ్చేస్తాను. నేను వచ్చాక నువ్వు వెళుదువుగాని"

"సార్!" నసిగేడు శ్రీధర్.

"ఇంటి దగ్గర నుండి మళ్ళీ ఫోను వచ్చింది సార్!"

"అవున్లేవయ్యా! మా ఫాదర్‌కి బాగాలేదట. జ్వరం వచ్చిందట. ఇందాకనే ఫోను వచ్చింది. ఒకసారి చూసి వచ్చేస్తాను."

అంటే, వీడికో రూలు, మనకో రూలు నన్నమాట. తన ఫాదర్‌కి చిన్న జ్వరం వస్తేనే అర్జంటుగా వెళ్ళాలన్నమాట. కాలింగ్ బెల్ నొక్కి, అటెండర్ అప్పారావుకి బ్రీఫ్‌కేసిచ్చి, కారులో పెట్టమని, చకచకా వెళ్ళిపోయేడు రంగనాథం.

శ్రీధర్‌కి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. డీలాపడిపోయి తన సీటులో కూలబడ్డాడు. ఉసూరుమంది అతడి ప్రాణం.

రంగనాథం రెండు రోజుల తరువాత వచ్చేడు. శ్రీధర్ పెట్టిన ఫైలుని తిరగేస్తూ, అప్పారావుని శ్రీధర్‌ని అర్జంటుగా పిలవమన్నాడు.

"శ్రీధర్ బాబుగారు వూరెళ్ళేరు సార్ అర్జంటుగా!"

"అదేమిటి? నేనొచ్చేక వెళ్ళమన్నాను కదా!" సీరియస్ అయ్యేడు రంగనాథం.

"అలాగే అనుకున్నారు సార్! కానీ నిన్న వాళ్ళమ్మగారు చనిపోయినట్లు ఫోను వచ్చింది. వెంటనే వెళ్ళిపోయేరయ్యా!" చెప్పేడు అప్పారావు.

"ఆ! వాళ్ళమ్మగారు చనిపోయేరా?" అవాక్కయ్యేడు రంగనాథం.

'ఛ! రెండు రోజులు సెలవిమ్మని బ్రతిమాలేడు. తను సెలవిచ్చి వుంటే, డాక్టరుకి చూపించేవాడు కదా! అప్పుడావిడ బ్రతికేదేమో! తన మూర్ఖత్వం ఖరీదు ఒక నిండు ప్రాణం!' ఆరోజంతా సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ పరధ్యానంగానే వున్నాడు రంగనాథం. తన మూర్ఖత్వాన్ని తానే నిందించుకుంటూ!

**-బి.రాధాకృష్ణమూర్తి (విజయవాడ)**